


- టి.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు

# ఏకాకి

తనూజ కలమూ, కాగితమూ తీసుకొని పడక గదిలో కిటికీ దగ్గర కూర్చుంది. సన్నగా తుంపర పడుతుండడం కిటికీలోంచి కనిపిస్తోంది. ఆ తుంపర మీద నుంచి వచ్చిన చిరుగాలి తనూజ ముఖాన్ని అతి చల్లగా హాయిగొల్పుతూ తాకింది. దేశంలో ప్రవేశించిన ఋతు పవనాలు నేటి మానవ మనస్తత్వాల కుళ్ళును భరించలేక తిరోగమించి, కల్మష మెరగని పసి పిల్లలు, జంతువులు, వృక్షాలు జ్ఞప్తికి రావడంతో తిరిగి ప్రవేశించి రెండురోజుల్నుంచి వర్షాల్నిస్తున్నాయి. పావనమూర్తి రాసిన ఉత్తరం తాలూకు భావోద్రేకపు సెగలు కొంత చల్లారి తనూజ కొంత శాంతి పొందింది. తల ప్రక్కకు తిప్పి చూసింది. మంచంమీద తన భర్త జీవశ్చవంలా నిద్రపోతున్నాడు. తన భర్తకు భగవంతుడు సవరించలేనంత శిక్ష వేశాడు. ఆ శిక్ష అతనొక్కడికే వేసి వుంటే అతనంత బాధ పడక పోవును. అతని భార్యకు కూడా అదే శిక్ష వేశాడు. తనూజ కళ్ళు చెమర్చాయి. గతంలోని అతని దురాగతాలు గుర్తుకువచ్చి మనసు కఠినంగా మారిపోయింది. ప్రసాదరావు అనే ఆ మృగం మీద జాలిపడడం తప్పేమో అనిపించింది. కాని, అతనితోపాటు తనకూ ఎయిడ్స్ అని తెలిసిన దగ్గర్నుంచీ, 'తన కారణంగా తన భార్య జీవితం కూడా బలైపోతోంద'న్న నిజాయితీతో కూడిన పశ్చాత్తాపాన్ని అతను కొంత కాలంగా తీవ్రంగా అనుభవిస్తుండడం గుర్తుకొచ్చి తనూజ మనసు మరల మెత్తబడింది.

'సరె, ముందు పావన్‌కి లెటర్ రాసి పోస్టుచేయాలి. నా జవాబు కోసం ఎదురు చూస్తుంటాడు' అనుకొంది. కలం సరిగా పట్టుకొని రాయడం మొదలుపెట్టింది. "డియర్ పావన్! ... ..." ఏం రాయాలో, ఎలా రాయాలో తనూజకు అర్థం కావడంలేదు. ఎడం చేత్తో తల పట్టుకొంది. ఏం తలంపుకు రాలేదు. పావన మూర్తి రాసిన ఉత్తరాన్ని తీసి మరోసారి చదవడం మొదలుపెట్టింది.

"స్నేహశీలి తనూజకు పావన మూర్తి రాయు లేఖాంశాలు. ఉభయ కుశలోపరి. నీకిలా లేఖ రాయవలసిన పరిస్థితి వస్తాదనుకోలేదు. తప్పనిసరై రాస్తున్నాను. అన్యదా భావించవద్దు."

ప్రపంచం కుగ్రామంగా మారిపోయిందని అందరూ అంటున్నారు. కాని, మనిషి ఏకాకి అయిపోయాడు. అదెవరూ గుర్తించడంలేదు. సాటి మనిషి, కాదు, దగ్గరి బంధువు, కాదు, రక్తసంబంధీకుడు, కాదు, తన తల్లికి పుట్టిన మరో బిడ్డ కష్టంలో వుంటే, ప్రమాదంలో వుంటే కన్నెత్తి అటు చూడని ప్రపంచం సోకాల్డ్ కుగ్రామం అయిపోయింది. నా ఆస్తి ఎలా తరిగిపోయిందన్నది ప్రక్కన పెట్టేయి. కాని, నా ప్రేమను కాలరాసేసి, నా ఆస్తి కోసం తమ కూతుర్ని నాకిచ్చి పెళ్ళిచేసిన నా అక్కా, బావా కూడా వాళ్ళ కూతురు కోసమైన కన్నెత్తి చూడడం లేదు. నేడు నా కూతురు కడుపు నిండా తిండి లేక, వయసు తెచ్చిన శరీర సౌష్టవాన్ని సక్రమంగా కప్పుకోవడానికి గుడ్డలేక నరక యాతన అనుభవిస్తోంది. ఆకలి బాధను మంచి నీళ్ళతో అణిచేసుకొంటోంది. చిరుగు పాతలతో శరీరాన్ని దాచుకోలేక సిగ్గుతో కుమిలిపోతోంది. నేనూ, నా భార్య దాని ముఖంలోకి చూడలేక ఉరిశిక్ష పడ్డ ఖైదీల్లా తలొంచుకొని కుమిలిపోతున్నాం. "నన్నెందుకు కన్నారు?" అని అడుగుతుందేమోనని క్షణం క్షణం మరణ భయాన్ని పొందుతున్నాం. ఆ బెంగతోనే నా భార్య మంచాన పడింది. ఆమె బ్రతకాలంటే యాభైవేలు కావాలి.

చూడు తనూజా! నేనిలా అడుగుతున్నానని మరోవిధంగా అనుకోవద్దు. నిన్ను కాబట్టే ధైర్యం చేసి అడుగుతున్నాను. నానుంచీ లక్షలకు లక్షలు సహాయం పొందిన వారిని సైతం నేనిచ్చిన దానిలో ఎంతోకొంత తిరిగి ఇమ్మని అడగలేకపోయాను. కాని, నువ్వు నాదగ్గర అప్పుగా తీసుకొన్న యాభైవేలు తిరిగి ఇవ్వగలవేమోనని గత్యంతరం లేక అడుగుతున్నాను. అప్పుడు నీ భర్త వ్యసనాలకు అలవాటుపడి ఉద్యోగం పోగొట్టుకొన్నప్పుడు నేను స్నేహితుడుగా సహాయం చేస్తానంటే, నువ్వు అప్పుగా అయితేనే తీసుకొంటానన్నావు. ఏదో విధంగా నీ ఇబ్బంది తీరడమే ప్రధానం అనుకొని ఆ రోజు ఇచ్చాను. ఈ రోజు నువ్వు ఉద్యోగం చేసుకొంటున్నావన్న ధైర్యంతో, ఆ రోజు 'అప్పుగానే' అని అన్నావు కాబట్టి ధైర్యంచేసి అడుగుతున్నాను. వీలైతే ఆ యాభైవేలు పంపించగలవా? 'ఈ పాత విషయాన్ని చెప్పకుండా ఒక స్నేహితురాలుగా నన్ను సహాయం చేయమని అడిగితే బాగుండును కదా!' అని నీకు అనిపించవచ్చు. అయితే, భార్యలకు వాళ్ల స్నేహితులకు సహాయం చేసేంత ఆర్థిక స్వేచ్ఛ అప్పుడే రాలేదని భావించి, నా అప్పు తీర్చమని అడగవలసి వచ్చింది. ఏమైనా నిన్ను ఇప్పుడిలా ఇబ్బంది పెడుతున్నందుకు క్షమించమని ప్రార్థిస్తున్నాను. ఉంటానిక.

నీ స్నేహితుడు
పి.పావనమూర్తి.

తనూజ ఏడుపు ఆపుకోలేక పోయింది. వస్తున్న కన్నీరుని ఆపలేదు. అప్పటికి ఆ లేఖను మూడు సార్లు చదివింది. మొదటి రెండుసార్లు ఏడుపు ఆపుకొంది. జవాబు రాయాలంటే మనసు కొంత తేలికపడాలి. అందుకే ఈసారి ఏడుపు ఆపుకొనే

నీ అక్కా, బావా విషం తాగుతానన్నారని నన్ను నా ఖర్మానికి వదిలేసి వాళ్ళమ్మాయిని పెళ్ళిచేసుకొన్నావు. అక్కడితో నువ్వు ఆగితే బాగుండును. మా నాన్న నీ మీద పంతంతో తీసుకొచ్చిన ఈ ప్రసాదరావును నేను చేసుకోనంటే, నువ్వే వచ్చి నన్నొప్పించావు. మనసులోంచి నిన్ను తుడపలేక పోయినా, మెడలో ఈ ప్రసాదరావుతో తాళి కట్టించుకొన్నాను. మెడలో తాళి పడిన దగ్గర్నుంచీ నీ ఆలోచనలను తగ్గించుకొంటూ, నా జీవిత భాగస్వామి ఆలోచనలతోనే మనసంతా నింపుకోవడానికి ప్రయత్నించాను. నన్ను పెళ్ళిచేసుకొన్నందుకు అతనికి నా కన్యత్వాన్ని కానుకగా ఇస్తే, అతను నాకు అప్పుల్లో కష్టాలూ, బాధలూ. ఇప్పుడు ఎయిడ్సూ ప్రతి కానుకలుగా ఇచ్చాడు...

ప్రయత్నం చేయలేదు ''పావన్!'' అంటూ బాధగా కుర్చీలో వెనకకు జారబడింది.

తాను మొదలుపెట్టిన లేఖను కొనసాగించింది. 'నీ దగ్గర అప్పుగా తీసుకొన్నాను కాబట్టి తీర్చాలని ఎంతగానో ప్రయత్నించాను. కాని తీర్చలేక పోయాను. నీ దగ్గర నాకు దాపరికం ఏముంది? అసలు విషయం చెప్పేస్తున్నాను. నాకూ, మా వారికి ఎయిడ్స్. ఈ విషయం తెలిసిన మూడో వ్యక్తివి నీవే. కలిసి మెలిసి ఉన్నంత మాత్రాన ఆ వ్యాధి అంటుకోదని తెలిసినా ఆ వ్యాధిగ్రస్తుల్ని అంటరాని వారిగానే చూస్తున్నారు. అంతటితో ఆగడంలేదు. వారి పిల్లలకు ఆ వ్యాధి లేకపోయినా వారిని కూడా దూరంగా ఉంచుతున్నారు. అందుకే హాస్టల్లో ఉండి చదువుకొంటున్న మా అమ్మాయికి ఏ ఇబ్బందీ రాకుండా ఉండడానికి మా వ్యాధిని రహస్యంగా ఉంచాం. ఇంకో సంవత్సరంన్నరలో మా అమ్మాయికి ఇంటర్ పూర్తవుతుంది. నేను పనిచేసే కంపెనీ ఎమ్‌డి గారితో మాట్లాడాను- నేను చనిపోతే నా ఉద్యోగం నా కూతురికి ఇవ్వాలని. నా ధోరణికి మొదట ఆయన విస్తుపోయినా, నా పర్సనల్ విషయాలను చర్చించకూడదనుకొన్నారు కాబోలు, ఏం ప్రశ్నించకుండా 'సరే' అన్నారు. ఈ సంవత్సరంన్నర బ్రతకడానికి మేము వాడుతున్న మందులకు నా జీతం సరిపోవడం లేదు. కొద్దోగొప్పో ఉన్న బ్యాంక్ బ్యాలెన్స్‌ను తీసివాడేశాం.

నీ అక్కా, బావా విషం తాగుతానన్నారని నన్ను నా ఖర్మానికి వదిలేసి వాళ్ళమ్మాయిని పెళ్ళిచేసుకొన్నావు. అక్కడితో నువ్వు ఆగితే బాగుండును. మా నాన్న నీ మీద పంతంతో తీసుకొచ్చిన ఈ ప్రసాదరావును నేను చేసుకోనంటే, నువ్వే వచ్చి నన్నొప్పించావు. మనసులోంచి నిన్ను తుడపలేకపోయినా, మెడలో ఈ ప్రసాదరావుతో తాళి కట్టించుకొన్నాను. మెడలో తాళి పడిన దగ్గర్నుంచీ నీ ఆలోచనలను తగ్గించుకొంటూ, నా జీవిత భాగస్వామి ఆలోచనలతోనే మనసంతా నింపుకోవడానికి ప్రయత్నించాను. నన్ను పెళ్ళిచేసుకొన్నందుకు అతనికి నా కన్యత్వాన్ని కానుకగా ఇస్తే, అతను నాకు అప్పుల్లో కష్టాలూ, బాధలూ. ఇప్పుడు ఎయిడ్సూ ప్రతి కానుకలుగా ఇచ్చాడు... ఇంకా ఏదో రాయబోయింది. చటుక్కున మెలుకువ వచ్చింది. చుట్టూ చూసింది. ప్రసాదరావు మంచంమీద నిద్రలోనే కదులుతున్నాడు. తనూజ తాను అప్పటివరకూ ఉత్తరం రాస్తున్నట్లు కలగన్నట్లు గ్రహించింది. నవ్వాల్లో ఏడ్వాల్లో తెలియని పరిస్థితి. విషాదంగా నవ్వింది. పై విషయాలన్ని రాస్తే తన మనసుకు ఉపశమనంగా ఉంటుంది గాని, పావనమూర్తి చాలా బాధపడతాడని భావించి, రాయకూడదనుకొంది.

తాను రాసిన ''డియర్ పావన్'' అన్న రెండు మాటలను చదివి వాటి ప్రక్కన మరో కొన్ని పదాలను చేర్చింది. ''నీ అప్పు తీర్చే స్థితిలో నేను లేను. ఇప్పుడే కాదు. ఎప్పటికీ తీర్చలేను'' అన్నవి ఆ పదాలు. వెంటనే ఆ కాగితాన్ని మడిచి కవర్లో పెట్టి, జిగురుతో కవరు మూసేసింది. ఆ వెంటనే చిరునామా రాసి, తపాల బిళ్లను అతికించి, ఫర్లాంగ్ దూరంలో ఉన్న తపాల పెట్టె దగ్గరకు వెళ్ళి అందులో వేసి, హృదయం నిండా ఊపిరి పీల్చుకొంది. 'పావన్! నీలాంటి ఉత్తముడ్ని ఏకాకిని చేయడం ఈ సమాజం దురదృష్టం. నీ భార్య బ్రతుకుతుంది. నిన్నిప్పుడు నిర్లక్ష్యం చేసిన వారు నీ దర్శనం కోసం పడుగాపులుపడే రోజు వస్తుంది కూడా! అప్పటికి నేనుండను గాని, నా మరణం తర్వాత నేను దుర్మార్గురాలను కాదని తెలుసుకొంటావన్న ఆశ ఆనందాన్నిస్తోంది' అని అనుకొని తేలిక పడ్డ మనసుతో ఇంటికి బయల్దేరింది.

* * *

తనూజ, ప్రసాదరావు చెరో మంచం మీద పడుకొని ఉన్నారు. వారి ముఖాల్లో మృత్యువు ప్రతిబింబిస్తున్నది. వారిద్దరిమధ్యా కుర్చీలో కూర్చొన్న పావనమూర్తి, ''ఎంత పనిచేశారు ప్రసాదరావుగారూ! మీరు నాకు, యాభైవేలూ తెచ్చి ఇచ్చినప్పుడు నాకు ఈ విషయం చెప్పకపోవడం దారుణమండీ! నేను తనూజకు రాసిన



ఉత్తరం మీరు చదివి, మీరు గతంలో ఉద్యోగం చేసిన కంపెని యజమానితో మాట్లాడి, మీ వైద్యం నిమిత్తం మీకు యాభైవేలు మంజూరు చేసేట్లు చేసి, ఆ యాభైవేలూ నాకు తెచ్చిస్తారా? నా భార్యకు వైద్యం ప్రభుత్వం తలపెట్టిన ఒక పథకం ద్వారా జరిగేట్లు ఒక డాక్టరుగారు ఉపకారం చేసినా మీ డబ్బు మీకు తెచ్చి ఇవ్వని దుర్గార్గున్ని నేను. ఆ డబ్బుతో షేర్ల బిజినెస్ చేసి, అంబానీ సోదర్ల గొడవ తేలిన సందర్భంలో షేర్ల ధరలు విపరీతంగా పెరగడంతో ఒక్క సంవత్సరంలోనే కోటీశ్వరున్ని అయ్యాను. కాని మీరిక్కడ సరైన మందులు వాడలేక ఎంతో బాధను అనుభవిస్తూ జీవించగలిగే నెలలను కోల్పోయారు. నేను ఎంత పాపినయ్యానండీ!'' అంటూ వస్తున్న కన్నీటిని జేబురుమాలుతో తుడుచుకొన్నాడు.

తనూజ భర్తవైపు ఎంతో మెచ్చుకోలుగా చూసింది. పావనమూర్తి వైపు 'నువ్వు మంచివాడివి, నీకు మంచే జరుగుతుంది' అన్నట్లు చూసి, కళ్ళు మూసుకొంది. ఇంక తెరవలేదు. ''తనూజా!'' అంటూ పావనమూర్తి తనూజను తట్టి లేపాడు. కాని ఆమె లేవలేదు. ఈసారి ''తనూజా!'' అంటూ బిగ్గరగా ఏడ్చాడు.

ప్రసాదరావు కన్నీళ్ళు తుడుచుకొంటూ, ''తాను ముందు వెళ్ళిపోయి నన్ను ఒంటర్ని చేసేసింది. ఆమెకు దహన సంస్కారాలు జరిపే భాగ్యం లభించినందుకు ఒక రకంగా సంతోషమే!'' అన్నాడు.

శవాన్ని మోయడానికి ఎవరూ లేరు. పావనమూర్తి శవాన్ని భుజాన వేసుకొని తీసుకెళ్ళి తన కారులో వెనుక సీట్లో పడుకోపెట్టాడు. వెనక్కొచ్చి, ప్రసాదరావును తీసుకెళ్ళి, కార్లో తన ప్రక్కన కూర్చోబెట్టుకొని, శ్మశానానికి బయల్దేరాడు. ''నా కూతురు బాధ్యత మీదే'' అన్నాడు ప్రసాదరావు. పావనమూర్తి స్టీరింగ్ మీదున్న తన చేయి తీసి, ప్రసాదరావు చేయి మీదవేసి ఆత్మీయంగా నొక్కాడు. ఆ స్పర్శలో ప్రసాదరావు కూతుర్ని తన కూతురుగా స్వీకరిస్తున్న భావాన్ని తెలియజేశాడు. ప్రసాదరావు హాయిగా నిట్టూర్చాడు.

ప్రసాదరావు చితి అంటించాడు. మంటలు చెలరేగాయి. ''నేను ఏకాకిగా బ్రతకలేను'' అంటూ ఆ మండే చితిలో పడిపోయాడు. దిగ్భ్రాంతుడైన పావనమూర్తి అతి కష్టంమీద అతన్ని బయటకు తీశాడు.

అప్పటికే ప్రసాదరావు చాలావరకూ కాలిపోయాడు. పావనమూర్తి చేతిలో ప్రాణం విడిచాడు. భార్య చితిలోనే భర్త శవాన్నివేసి, కాటికాపరి చేత మరిన్ని కట్టెలు తెప్పించి చితిలో వేసి, శవాలు పూర్తిగా కాలేవరకూ ఉండి, పావనమూర్తి కారు దగ్గరకు బయల్దేరాడు.

''చచ్చిన తర్వాత మోయడానికి నలుగురు మనుషులు కూడా లేనంత ఏకాకిగా మనిషి ఎందుకు అవుతున్నాడు?'' అని పావనమూర్తి ప్రశ్నించుకొన్నాడు. పెచ్చుపెరుగుతున్న స్వార్థం అన్న జవాబు స్ఫురించింది. తనూజ కూతుర్నీ, తన కూతుర్నీ ఈ స్వార్థానికి అతీతంగా పెంచి, వాళ్ళ స్నేహాన్ని ప్రపంచానికి ఆదర్శం అయ్యేలా చేయాలనుకొంటూ కారు డోరు తెరిచాడు. చితి మీదనుంచి వచ్చిన వెచ్చని గాలి అతని ఆలోచనలను మెచ్చుకొంటున్నట్లు అతన్ని వెనుకనుంచి తాకింది.

★